ఎత్తు వేస్తే ప్రత్యర్థి చిత్తే..


చదరంగం ఆడుతున్న బాలికలు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

- చదరంగంలో రాణిస్తున్న యువత
- రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ప్రతిభ

ప్రకాశం నగర్: చదరంగంలో చిన్నారులు, యువత ప్రతిభ చూపుతూ జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తున్నారు. రాజమహేంద్రరంలోని వైఎంవీఏ హాలులో జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా స్థాయి చదరంగం పోటీలు హోరాహోరీగా జరిగాయి. అండర్- 9 బాలురు, బాలికల విభాగంలో, అండర్ -19 బాలురు, బాలికల విభాగంలో పోటీలు నిర్వహిస్తున్నారు. నాలుగు విభాగాల్లో జరిగే ఈ చదరంగం పోటీల్లో సుమారు 70 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. జిల్లా స్థాయి అండర్-19 విభాగంలో విజేతలుగా నిలిచిన బాలురు నంద్యాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కానున్నారు. అండర్ -19 బాలికల విభాగంలో విజేతలుగా నిలిచిన బాలికలు, అండర్ - 9 బాలురు, బాలికల విభాగంలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు మన జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారు.

మానసిక ఒత్తిడి దూరం

చదరంగం ఆడటం వల్ల జ్ఞాపక శక్తి పెరగడంతో పాటు, మెదడు మరింత చురుకుగా పనిచేస్తుంది. ముఖ్యంగా విద్యార్థుల్లో చదువుల కారణంగా ఏర్పడే మానసిక ఒత్తిడి దూరమై, సమస్యను అధిగమించే పోటీతత్వం ఏర్పడుతుందని చదరంగం క్రీడా నిపుణులు చెబుతున్నారు. ఐక్యూ పెరడగంతో పాటు, అతిగా మతిమరుపు ఉన్న చిన్నారులకు చదరంగం ఒక మంచి ఔషధంగా పనిచేస్తుంది. పిల్లల్లో సృజనాత్మక పెరగడంతో పాటు వారికి మానసిక ఉల్లాసం చేకూరుతుందని మానసిక నిపుణులు సూచిస్తున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

చదరంగం పోటీల్లో జిల్లా స్థాయి అండర్- 19 విభాగంలో ఎం.భార్గవ సుషాంత్ సాకేత్, ఎం.సీతా సాగర్, కె.ప్రభాకర్, ఆర్.షణ్ముఖ రెడ్డి విజేతలుగా నిలిచారు. అండర్ -19 బాలికల విభాగంలో ఎస్.కావ్య, కె.అక్షయ, ఎస్.తేజస్వీ దేవి, జె.చంద్రజ ఎంపికయ్యారు. వీరితో పాటు అండర్- 9 బాలుర విభాగంలో కె.ఇషాంత్, కె.సాకేత్ రామ్, బాలికల విభాగంలో జి.వర్ణిక త్విషా, ఎస్.ఆధ్య జిల్లాస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచి, రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారు.

మంచి గుర్తింపు



ప్రపంచ వ్యాప్తంగా చదరంగం ఆటకు మంచి గుర్తింపు ఉంది. ఆలోచనా శక్తిని పెంచుకునేందుకు ఎంతో ఉపయోగపడుతుంది. జిల్లా చదరంగం సంఘం ద్వారా అనేక మంది క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవ్వడంతో పాటు పతకాలు సాధించడం గర్వకారణం. గతంతో పోలిస్తే ఇప్పుడు చిన్నారులు, యువత చదరంగం ఆవశ్యకతను గుర్తించి, ఆటలోని మెళకువలు నేర్చుకుంటున్నారు.

– జీవీ కుమార్, జిల్లా చదరంగం సంఘం కార్యదర్శి

మోదీ పాలనలో అన్ని రంగాల్లో అభివృద్ధి

ప్రకాశం నగర్: ప్రధాని నరేంద్ర మోదీ 9 ఏళ్ళ పాలనలో అన్ని రంగాల్లో అభివృద్ధి జరిగిందని బీజేపీ అర్బన్ కన్వీనర్ యెనుముల రంగరావు తెలిపారు. శుక్రవారం స్థానిక వైఎంఎ హాలులో 5వ మండలం (21, 22, 23, 24, 25) డివిజన్ల బీజేపీ నాయకులు కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మండల అధ్యక్షుడు లలిత్ కుమార్ జైన్ అధ్యక్షత వహించగా, రంగారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి అవాస యోజన ద్వారా ఏ రాష్ట్రానికి లేని విధంగా పట్టణ పేదలకు 21,32,343, గ్రామీణ పేదలకు 2,48,682 లక్షల ఇళ్ల మంజూరు చేసిన ఘనత మోదీకే దక్కుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని 4,193 కిలోమీటర్ల జాతీయ రహదారుల నిడివిని డిసెంబర్ 2022 నాటికి 8,744 కిలోమీటర్లకు పెంచారని చెప్పారు. జిల్లా ముఖ్య కార్యదర్శి బూర రామచంద్రరావు, పార్టీ నాయకులు కురగంటి సతీష్, పిల్లాడి రుద్రయ్య, క్షత్రియ బాలసుబ్రహ్మణ్యం సింగ్ పాల్గొన్నారు.

రాష్ట్రంలోనే బెస్ట్ సిటీగా రాజమహేంద్రవరం


మాట్లాడుతున్న ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరాన్ని రాష్ట్రంలోనే బెస్ట్ సిటీగా అభివృద్ధి చేస్తున్నట్టు ఎంపీ మార్గాని భరత్‌రామ్ తెలిపారు. ఎంపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే చాలా వరకూ రూపురేఖలు మార్చామని, మరి కొన్నినెలల్లో మరింత అభివృద్ధి చేసి చూపెడతామన్నారు. 2015 పుష్కరాల్లో అభివృద్ధి పనుల కోసం మంజూరు చేసిన రూ.2 వేల కోట్లను టీడీపీ నాయకులు గోదావరి పాల్జేశారని, గోడలకు రంగులు తప్ప ఏమీ చేయలేదని ఎంపీ విమర్శించారు. సీఎం జగన్ రాజమహేంద్రవరంపై ప్రత్యేక అభిమానంతో రూ.125 కోట్లు మంజూరు చేశారని, అభివృద్ధి పనులు శరవేగంతో పరుగులు పెడుతున్నాయన్నారు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తనపై లేనిపోని విమర్శలు చేస్తున్నారని, తాను ఆయనకు శిష్యుడినని వ్యాఖ్యానించడం సరికాదన్నారు. మోరంపూడి బ్రిడ్జిని డిసెంబర్‌కు పూర్తిచేసి జాతికి అంకిత మిస్తామని ఎంపీ భరత్ రామ్ తెలిపారు. లాలాచెరువు, దివాన్ చెరువు, బొమ్మూరు, గామన్, వేమగిరి జంక్షన్ల వద్ద తాను ఎంపీగా ఉండగానే శంకుస్థాపన చేసి, నిర్మాణ పనులు చేపడతామన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, రాష్ట్ర గాండ్ల తెలికుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ సంకిన భవానీప్రియ, రావిపాటి రామచంద్రరావు, పాలిక శ్రీను, మార్గాని సురేష్, మార్తి లక్ష్మి, మజ్జి అప్పారావు, మార్తి నాగేశ్వరరావు, ఆచంట అనసూయ, దుంగామంగ, ఉల్లూరి రాజు, గుత్తుల భాస్కర్, అందనాపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

సమాజ సేవకులు వలంటీర్లు


వలంటీర్లను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: ప్రభుత్వ పథకాలను సకాలంలో లబ్ధిదారులకు అందిస్తున్న వలంటీర్లు సమాజ సేవకులు అని మాజీ కార్పొరేటర్ మజ్జి నూకరత్నం కొనియాడారు. 31వ డివిజన్ అన్నపూర్ణమ్మపేట, మదన్ సింగ్ పేట 57వ సచివాలయంలో శుక్రవారం వలంటీర్లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మజ్జి నూకరత్నం మాట్లాడుతూ పథకాలను ప్రజలకు అందేటట్టు చేసి వలంటీర్లు ప్రభుత్వానికి మంచి పేరు తేవాలన్నారు. సేవావజ్ర పొందిన వలంటీర్ కీర్తిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీసెల్ చైర్మన్ మజ్జి అప్పారావు, అడ్మిన్ నాగలక్ష్మి, సచివాలయం సిబ్బంది వెంకట రమణ, విజయ, కుమారి, నాయకులు లంక నరేష్, షరీఫ్, పల్లెడ శంకర్, రమణ, రామ్మూర్తి, డేవిడ్ రాజ్ పాల్గొన్నారు.

వలంటీర్లకు సత్కారం


38వ వార్డు సచివాలయంలో వలంటీర్లను సత్కరిస్తున్న దృశ్యం

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక 27వడివిజన్ ఇన్నీసుపేట-3 సచివాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సచివాలయంలో వలంటీర్లను ఘనంగా సత్కరించారు. వలంటీర్లకు పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అడ్మిన్ సెక్రటరీ విజయ కుమార్ రెడ్డి, సెక్రటరీలు గీత, శ్రీవిద్య, సురేఖ, కల్పన, వెంకట్, రంజిత్, వైఎస్సార్ సీపీ వార్డు సచివాలయ కన్వీనర్ రాపర్తి నాగలక్ష్మి పాల్గొన్నారు.

నగరంలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ దినేష్ కుమార్

ప్రకాశం నగర్: నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను జూన్ 15లోగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులను నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ ఆదేశించారు. స్థానిక నగర పాలక సంస్థ సమావేశ మందిరంలో శుక్రవారం సాంకేతిక విభాగం సమీక్ష సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ హౌసింగ్‌బోర్డులో కాలువల నిర్మాణం వెంటనే పూర్తి చేయాలన్నారు. వర్షపు నీటిని నిల్వ చేయడానికి బ్యాలన్సింగ్ రిజర్వాయర్ ఏర్పాటు చేయాలన్నారు. హౌసింగు బోర్డులోని డ్రైనేజీల్లో సిల్ట్‌ను, నీటి సరఫరా సంబంధిత సమస్యలను గుర్తించి అంచనాలను తయారు చేయాలని ఆదేశించారు. లాలాచెరువుకు పూర్తి స్థాయిలో నీటి సరఫరాకు డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు చేయాలన్నారు. గత సమావేశంలో పెండింగు బిల్లులను పూర్తిస్థాయిలో సమర్పించాలని ఆదేశించినప్పటికీ, కొందరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల బిల్లు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, వారికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. కంబాలచెరువు అభివృద్ధికి సంబంధించి అన్ని పనులకు టెండర్లు పిలవాలని ఆదేశించారు. సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండురంగారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు శేషగిరిరావు, కనకారావు, గిరిధర్ పాల్గొన్నారు.

డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా మౌనిక


డాక్టర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

ధవళేశ్వరం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా డాక్టర్ బి.మౌనిక ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తూర్పు గోదావరి జిల్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేసే డాక్టర్లు అసోసియేషన్‌గా ఏర్పడి శుక్రవారం ధవళేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా టి.రవి కుమార్, ఉపాధ్యక్షులుగా కె.నిశిత, ఏవీకే చైతన్య, కోశాధికారిగా బి.శ్రీనివాస్ ఎన్నికయ్యారు. అధ్యక్షురాలు డాక్టర్ మౌనిక మాట్లాడుతూ రానున్న రోజుల్లో యూనియన్‌ను మరింత బలోపేతం చేసి, డాక్టర్లు ఎదుర్కొనే సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు కె.సుధాకర్, శ్రీనివాస్, ధర్మరాజు పాల్గొన్నారు.

పరిష్కారం దిశగా కోరుకొండ భూ సమస్య


తాడేపల్లిలో జరిగిన ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల సమావేశం

రాజానగరం/మధురపూడి: భూములున్నాయి, కానీ వాటిని అమ్ముకునేందుకు అవకాశం లేదు. పిల్లల పెళ్లిళ్లు, చదువుల కోసం క్రయవిక్రయాలు చేద్దామన్నా ఆయా భూములకు రిజిస్ట్రేషన్లు జరగకుండా నిషేధం ఉండటంతో ఆ భూముల రైతులు గత దశాబ్ద కాలంగా ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా తాను ఎమ్మెల్యేగా విజయం సాధించిన నాటి నుంచి చేస్తున్న ప్రయత్నాలు ఫలించే దిశకు చేరుకున్నాయి. ముఖ్యమంత్రి కార్యదర్శితో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులతో తాడేపల్లిలోని సీఎం కార్యాలయంలో శుక్రవారం ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయా భూములకు రిజిస్ట్రేషన్ల అవకాశం కల్పించాలనే రైతుల కోరిక చర్చకు రావడంతో ఆయా భూముల రైతాంగంలో ఆనందం వ్యక్తమవుతుంది.

సమస్య ఇదే..

కోరుకొండ మండలం కాపవరం, శ్రీరంగపట్నం, కోరుకొండ, గోకవరం మండలం అచ్యుతాపురం పరిసర గ్రామాల్లోని భూములను 22 ఏ-1 సి ప్రకారం నిషేధ జాబితాలో చేర్చారు. దీనితో ఆయా భూములకు రిజిస్ట్రేషన్లు జరగకుండా ఆగిపోయాయి. ఫలితంగా సుమారు 10 వేల మంది రైతులు తమ భూములకు క్రయ విక్రయాలు చేసుకునేందుకు వీలు లేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. దశాబ్ద కాలంగా నెలకొన్న ఈ సమస్య పరిష్కారం కోసం ఆయా రైతాంగం ఎక్కని మెట్లు, దిగని గడపలు లేవు. సమస్య పరిష్కారానికి హామీలిచ్చే నాయకులేగానీ, పరిష్కారం కోసం కృషి చేసిన వారు లేరు. ఈ నేపథ్యంలో రైతులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఈ సమస్య పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. పలుమార్లు సీఎంని కలుసుకుని ఈ సమస్యను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ క్రమంలో సీఎం కార్యాలయంలో శుక్రవారం ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఉన్నత స్థాయి అధికారులతోపాటు స్థానిక ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, కృష్ణా జిల్లా జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి సీసీఎల్ఏ సాయిప్రసాద్, దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, న్యాయశాఖ కార్యదర్శి దుర్గాప్రసాద్, కలెక్టర్ కె.మాధవీలత, రాజమహేంద్రవరం ఆర్డీఓ చైత్రవర్షిణి తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందుల ఏకరువు

సమావేశంలో పాల్గొన్న కోరుకొండ మండలానికి కొందరు రైతులు గత కొన్ని సంవత్సరాలుగా తమ భూములకు క్రయవిక్రయాలు జరగక పడుతున్న ఇబ్బందులను ఏకరువుపెట్టారు. ఇల్లు, స్థలాలు, పొలాలు ఇలా సమస్తం నిషేధ జాబితాలో ఉండటం వల్ల పిల్లల పెళ్లిళ్లు, చదువులు ఇలా.. ఏ అవసరం వచ్చినా అమ్ముకోడానికి అవకాశం ఉండటం లేదన్నారు. ఈ భూములపై ఉన్న నిషేధాన్ని తొలగించి, రిజిస్ట్రేషన్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కోరారు. అందుకు ఉన్నతాధికారులు కూడా సానుకూలంగా స్పందించడంతో త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తపరిచారు. సమావేశంలో పాల్గొన్న రైతులలో డాక్టర్ కుంచె వెంకటరమణ, కోరుకొండ మండల ప్రజాపరిషత్ ఉపాధ్యక్షుడు బలుసు బద్రీనారాయణ, కోకా నరసింహారావు, నీరుకొండ నాగేశ్వరావు, సూరిశెట్టి శ్రీనివాసరావు ఉన్నారు.

జంగాల కాలనీలో సమస్యలు పరిష్కరించండి


చందన నాగేశ్వర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీర్లపల్లి ఏసు తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరు జంగాల కాలనీలో సమస్యలు పరిష్కరించాలని బేడ బుడగ జంగాల సంఘం జిల్లా అధ్యక్షుడు వీర్లపల్లి ఏసు ఆధ్వర్యంలో జంగాల కాలనీ వాసులు శుక్రవారం వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీగ్రీనింగ్అండ్‌బ్యూటీఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్‌కు విన్నవించారు. జంగాల కాలనీలోని ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరం, ఇళ్లపై నుంచి వెళుతున్న విద్యుత్ తీగల వల్ల స్థానికులు భయపడుతున్నారన్నారు. స్పందించిన చందన వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి ఆ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

అలాగే బేడ, బుడగ, జంగాలకు ఆ ప్రాంతంలో నూతన కమ్యూనిటీ హాలు నిర్మించాలని కోరగా, త్వరలో నిర్మించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యదర్శి సీమోను, చర్చి పాస్టర్ మహేష్, సంఘ అధ్యక్షులు జాను, శివరాత్రి సైమోన్, వీర్లపల్లి, మార్క్, వీర్లపల్లి, చిన్న, వెంకన్న, శ్రీను పాల్గొన్నారు.

ఆశ చూపి రూ.50 లక్షల దోపిడీ

రాజానగరం: రిజర్వు బ్యాంకు తీసుకున్న నిర్ణయం మేరకు దేశంలో రూ. రెండు వేల నోట్ల చలామణి నిలిచిపోవడంతో కొందరు అక్రమార్కులు దానిని కూడా తమ అనుకూలంగా మలుచుకుంటున్నారు. అమాయకులను ఎంపిక చేసుకుని దోపిడీకి పాల్పడుతున్నారు. స్థానిక పోలీసు స్టేషను పరిధిలోని కొంతమూరులో ఈ విధంగా ఒక వ్యక్తి నుంచి రూ. 50 లక్షలు తీసుకుని ఉడాయించారు. సీఐ కాశీవిశ్వనాథ్ శుక్రవారం రాత్రి విలేకరులకు తెలిపిన వివరాలిలావున్నాయి. కోనసీమ జిల్లా మండపేటకు చెందిన మాజేటి లక్ష్మీనారాయణ అనే కిరాణా వ్యాపారి అత్యాశకు పోయి రూ. 50 లక్షలు పోగొట్టుకున్నాడు. ప్రస్తుతం రూ. రెండు వేల నోట్ల మార్పిడి కష్టతరంగా మారిందని, ఈ కారణంగా ఆ నోట్లు రూ.60 లక్షలు తీసుకుని, రూ. 500 నోట్లు రూ.50 లక్షలు ఇస్తే చాలని అతడి స్నేహితుడొకరు ఆఫరు ఇచ్చాడు. దీంతో రూ.10 లక్షలు కలిసొస్తుందని లక్ష్మీనారాయణ ఆశపడ్డాడు. ఇంటి నిర్మాణం కోసం అప్పు చేసి ఉంచిన సొమ్ముల నుంచి రూ. 50 లక్షలు తీసుకుని అవతలి వ్యక్తులు (మూర్తి, రామలింగేశ్వర్రావు, ప్రవీణ్)లు చెప్పిన విధంగా గురువారం రాజమహేంద్రవరం రూరల్ మండలంలోని కొంతమూరు నూకాలమ్మ గుడి వద్దకు చేరుకున్నాడు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న ఆ వ్యక్తులు పోలీసుల మాదిరిగా హారన్ వేసుకుంటూ వచ్చి, అతడి నుంచి రూ.50 లక్షలు తీసుకుని ఉడాయించారు. తాను దోపిడీకి గురైన సంగతి తెలుసుకున్న లక్ష్మీనారాయణ రాజానగరం పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ కాశీవిశ్వనాథ్ తెలిపారు.

క్లుప్తంగా

రైల్వే ప్రయాణికులకు తాగునీరు పంపిణీ


తాగునీరు పంపిణీ చేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ: దక్షిణ మధ్య రైల్వే స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో రైల్వే ప్రయాణికులకు సమ్మర్ డ్రింకింగ్ వాటర్ సర్వీస్ ప్రారంభించారు. స్థానిక ప్రధాన రైల్వే స్టేషన్ మొదటి ప్లాట్‌ఫాంపై అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ ఎం.గణేషన్ శుక్రవారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజరాజ నరేంద్ర రైల్వే స్కౌట్స్ అండ్ గైడ్స్ ఓపెన్ గ్రూప్ లీడర్ ఎస్వీ భద్రరావు మాట్లాడుతూ వేసవి ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదు అవుతున్న దృష్ట్యా నెలరోజుల పాటు ఉదయం 7 నుంచి 10 గంటల వరకూ, మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకూ తాగునీరు పంపిణీ చేస్తామన్నారు. రైల్వే కంపార్ట్‌మెంట్ల నుంచి బయటకు రాలేని ప్రయాణికుల కోసం 300 వాటర్ బాటిళ్లు అందజేశామన్నారు. కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ గంగాప్రసాద్, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి



ప్రతిజ్ఞ చేస్తున్న ఆశారేఖ తదితరులు

సీటీఆర్ఐ: పర్యావరణ పరిరక్షణకు సమష్టిగా కృషి చేద్దామని అటవీశాఖాధికారి ఆశారేఖ అన్నారు. ప్రాంతీయ అటవీ పరిశోధనా సంస్థ, డివిజనల్ ఫారెస్టు రిసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో మొక్కల పెంపకంపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం కోరుకొండ రోడ్డులోని రామకృష్ణ మిషన్‌లో కంప్యూటర్ కోర్సులు నేర్చుకుంటున్న విద్యార్థులకు పర్యావరణం గురించి వివరించారు. .

మహిళలకు చీరల పంపిణీ


చీరలు పంపిణీ చేస్తున్న డాక్టర్ రామారెడ్డి

ప్రకాశం నగర్: గోదారోళ్ల కితకితలు ఫేస్‌బుక్ గ్రూప్ ద్వారా గోదావరి జిల్లాల యాసను మరింత వెలుగులోకి తీసుకువచ్చిన బొమ్మూరుకు చెందిన ఈవీవీ సత్యనారాయణ ప్రథమ వర్ధంతి శుక్రవారం స్థానిక వీరభద్రపురంలోని గాంధీ కస్తూర్బా సేవా సంఘం, స్త్రీల వృద్ధాశ్రమంలో గ్రూప్ గౌరవ అడ్మిన్ డాక్టర్ కర్రి రామారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈవీవీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. వృద్ధులకు నిత్యావసరాలు, అల్పాహారం, దుస్తులు పంపిణీ చేశారు. హిమాయత్ మహ్మద్, అమీర్ పాషా, సరిత మేన్ని, విజయ్ పాల్గొన్నారు.

నేడు అనంతేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

కడియం: కడియపులంకలోని హరిహర మహాక్షేత్రంలో కొలువుదీరిన అపర్ణాసమేత అనంతేశ్వరస్వామి ఆలయ 14వ వార్షికోత్సవం శనివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ మార్గాని సత్యనారాయణ తెలిపారు. ఆయన శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ శనివారం తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి గణపతి స్వామికి గరిక పత్రి పూజ, సూర్యనారాయణ మూర్తికి తెల్లజిల్లేడు పువ్వులతో పూజ, లక్ష్మీనారాయణ స్వామికి తులసి పత్రి పూజ, అపర్ణా దేవికి చక్రార్చన సహిత కుంకుమార్చన, అనంతేశ్వరుడికి పంచామృతాభిషేకాలు, ఏకాదశ రుద్రనమకచమక పూర్వక అన్నాభిషేకం జరుగుతుందన్నారు. అనంతరం అభిషేక అన్నప్రసాద వితరణ, సాయంత్రం ఆరు గంటలకు జేష్టపౌర్ణమి సందర్భంగా అపర్ణాదేవికి పౌర్ణమి హోమం జరుగుతాయని సత్యనారాయణ వివరించారు.

సొమ్ము లాక్కుని పరారీ

కంబాలచెరువు: ఆనంద్ నగర్‌కు చెందిన పి.ప్రసాద్ గత నెల 25వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో నడుచుకుంటూ వెళ్తున్నాడు. దేవీ చౌక్ సమీపంలో నలుగురు వ్యక్తులు వచ్చి అతడి వద్ద ఉన్న రూ.1700 లాక్కుని పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలి

ప్రకాశం నగర్: ప్రధాని నరేంద్రమోదీ అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సీఐటీయూ జాతీయ ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి అన్నారు. కార్మిక నాయకుడు పర్వ సత్యనారాయణ శత జయంతిని శుక్రవారం శ్యామలా సెంటర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ, సీపీఎం నగర కార్యదర్శి బి.పవన్ పాల్గొన్నారు.

ఐటీఐ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో ఐటీఐ కోర్సుల్లో చేరడానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ఒరిజనల్ సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ పి.పరమేశ్వరరావు తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తప్పనిసరిగా ప్రభుత్వ ఐటీఐలో తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకుని రశీదు పొందాలన్నారు. ఆ రశీదునను కౌన్సెలింగ్ జరిగే మయంలో విధిగా చూపించాలన్నారు. కొత్తగా దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 6వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ అవకాశం ఉందన్నారు. iti.ap.gov.in అను వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని తగు రశీదు పొందాలన్నారు.

విద్యా ప్రతిమకు పీహెచ్‌డీ


పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న విద్యాప్రతిమ

రాజమహేంద్రవరం రూరల్: హితకారిణి సమాజం ఆధ్వర్యంలోని శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా డిగ్రీ పీజీ కళాశాల ఎంబీఏ ప్రిన్సిపల్ (ఎఫ్ఏసీ), బొమ్మూరు గ్రామానికి చెందిన వి.విద్యా ప్రతిమ పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీలో హ్యూమన్ క్యాపిటల్ మేనేజ్ మెంట్ ఇన్ రిటైల్ సెక్టార్ ఎ.స్టడీ విత్ రిఫరెన్స్ టు ఎంప్లాయిస్ పర్‌ఫెక్టివ్ ఇన్ తూర్పు గోదావరి జిల్లా ఆంధ్రప్రదేశ్ సిద్ధాంత వ్యాసానికి ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి ఆమోద ముద్ర లభించింది. విద్యా ప్రతిమ తన సిద్ధాంత వ్యాసాన్ని కామర్స్ మేనేజ మెంట్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ జాలాది రవి పర్యవేక్షణలో సమర్పించారు. పీహెచ్‌డీ అందుకున్న విద్యా ప్రతిమను పలువురు ప్రముఖులు అభినందించారు.

ముగిసిన ఫుట్‌బాల్ శిబిరం

ప్రకాశం నగర్: ఎఫిక్ ఫుట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యంలో ఆవ రోడ్డులోని ఫుట్‌బాల్ కోచ్ ఎస్.ప్రభుకుమార్ సమక్షంలో జరుగుతున్న శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి జిల్లా చీఫ్ కోచ్ డీఎంఎం శేషగిరి, ఆదికవి నన్నయ క్రీడావిభాగం అధ్యాపకుడు ఫణీంద్ర, క్రీడా పరిశోధకులు సుంకర నాగేంద్ర కిషోర్, విశ్రాంత వ్యాయమ ఉపాధ్యాయుడు సీరా గంగధర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అండర్ - 14 విభాగంలో విజేతలకు ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కోచ్ శ్రీనివాస్, శ్రీరామ్, ఎస్.రామచంద్ర, సురేష్ పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ


ఆలయంలో హోమం చేస్తున్న పండితులు

సీటీఆర్ఐ: వీఎల్ పురంలోని ఆల్ బ్యాంకు కాలనీలో నూతనంగా నిర్మించిన మహాగురుస్థాన్‌లో శుక్రవారం విజయదుర్గాదేవి, సాయిబాబా విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఆలయ నిర్మాణ కర్త, నిర్వాహకుడు ఆర్.శివనారాయణ మాట్లాడుతూ ఈ స్థలంలో రాజరాజు నరేంద్రునికి యుద్ధంలో విజయం ప్రసాదించిన విజయ దుర్గాదేవి సంచరించారన్నారు. ఇక్కడ ప్రధానంగా అమ్మవారి ఆలయం ఏర్పాటు చేయాలని మహాగురు నరేంద్రనాథ్ యోగేశ్వర స్వామి ప్రసన్న గురువుల సూచన మేరకు కృష్ణ శిలతో విజయదుర్గాదేవి అమ్మవారి విగ్రహం ఏర్పాటు చేశామన్నారు. సాయిబాబా పాలరాతి విగ్రహం ప్రతిష్ఠించామన్నారు.

రాజయోనాకు పురస్కారం

రాజమహేంద్రవరం రూరల్: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని పుడమి సాహితీ వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ తెలుగు యూనివర్సిటీలో విభిన్న రంగాల్లోని ప్రతిభావంతులకు తెలుగు కీర్తి పురస్కారాలను అందించారు. ఇందులో భాగంగా ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో దేశ, విదేశాల్లో చేస్తున్న తెలుగు సాంస్కృతిక కార్యక్రమాలను మెచ్చి డాక్టర్ అద్దంకి రాజయోనాకు పురస్కారం అందజేశారు.

చిన్నారుల ప్రతిభ

కడియం: పేపర్‌తో వివిధ రకాల కళాకృతులు తయారు చేయడంలో చిన్నారులు ప్రతిభ చూపారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు పేపర్ క్రాఫ్ట్‌లో శిక్షణ ఇచ్చారు. అనంతరం పోటీలు నిర్వహించారు.